ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 22 | సంచిక : 2 | అక్టోబర్ 2016

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 16

గౌరవ సంపాదకులు

శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రు॥ 150/-

విడి ప్రతి : రు॥ 12/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు – 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు – 534 265

☎ 08814 - 224747

9247104551

ఈ సంచికలో....

జూన్ 2016

అరుణాచలం

16-09-1984

జిన్నూరు

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, జూలై 2016, అరుణాచలం)**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మీకు దేహం తెలుస్తోంది, దేహానికి ఉన్న సంసారం తెలుస్తోంది. మీరు ఇక్కడ అరుణాచలంలో కూర్చుని ఇంట్లో వారి గురించి ఆలోచిస్తూ ఉంటారు కదా! ఇంట్లో వాళ్ళు ఎలా ఉన్నారు? ఏమిటి? అనుకొంటారు కదా! అంటే మీకు ఇల్లు జ్ఞాపకం వస్తోంది, మీ దేహం జ్ఞాపకం వస్తోంది. భగవాన్ ఏమి చెప్పారు అంటే మీకు తెలియని గొడవలు వదిలేయండి. మీకు దేహం తెలుస్తోంది. మీ దేహానికి సంబంధించిన కుటుంబం తెలుస్తోంది. ఈ రెండూ శరణాగతి చెయ్యండి అప్పుడు మీ మనస్సు చల్లబడిపోతుంది. ఈ శరణాగతి వల్ల మీ నెత్తిమీద ఉన్న బరువు తగ్గిపోతుంది, మీ మనస్సు తేలిక అవుతుంది, జ్ఞానాన్ని అన్వేషించడానికి మీ మనస్సు ఫిట్ అవుతుంది. అప్పుడు మీ కుటుంబబాధ్యత ఆయనే చూసుకుంటాడు. అందుచేత తెలియని విషయాలని వదిలేయండి, తెలుసున్న విషయాలను శరణాగతి చెయ్యండి. మీకు మామూలు శాంతి సరిపోదు. ఇవాళ సుఖంగా ఉంటేచాలు, రేపు దుఃఖం వచ్చినా పరవాలేదు అని అనుకొంటారా? మీరు అలా అనుకోరు. మీకు ముగింపులేని శాంతికావాలి. ప్రాణం పోయేటప్పుడు అంటే జీవుడు శరీరాన్ని విడిచిపెట్టేటప్పుడు శాంతిప్రవాహంలో ఉండాలి. శాంతిప్రవాహంలో ఉండగా నీ శరీరం పోతుంది అనుకో ఇంక నీకు శరీరాలు రావు. ఎందుచేతనంటే నీకు శరీరం అవసరం లేదు కాబట్టి. అయితే మీ కుటుంబసభ్యుల్ని మీరు శరణాగతి చెయ్యరు కదా! మీ కుటుంబ సభ్యులు జ్ఞాపకం వస్తూ ఉంటే మొత్తానికి చెడిపోతుంది. ఎందుచేతనంటే వారు జ్ఞాపకం వస్తూ ఉంటే మీరు ఈశ్వరునికి శరణాగతి చెయ్యలేరు.

అరుణాచలేశ్వరుడు నీకు ఏదైనా ఉపకారం చేస్తున్నాడు అనుకో అది నీకు తెలియాలి అని ఆయన అనుకోడు. నీకు తెలియటం కూడా

ఆయనకు ఇష్టం ఉండదు. అది సీక్రెట్‌వర్క్. మీరు ఎవరికయినా ఒక పండు ఇచ్చారు అనుకోండి, అది అందరికి తెలియాలి అనుకొంటారు. ఇంక కోటి జన్మలు ఎత్తినా మీకు జ్ఞానం రాదు. ఎందుచేతనంటే మీకు జ్ఞానం అక్కరలేదు, పబ్లిసిటీ కోరుకొంటున్నారు. అందుచేత ఆపబ్లిసిటీ వస్తుంది కాని ఇంక మీకు జ్ఞానంరాదు. ఐన్‌స్టీన్ ఒకమాట చెప్పాడు. ఏమనిషికీ జ్ఞానం అక్కరలేదు, వాళ్ళు కోరుకోవటంలేదు దానికి ఒక్కటే కారణం జ్ఞానం విలువ వారికి తెలియటంలేదు. బంగారం తీసుకొని వెళ్ళి పిల్లలకు ఇస్తే అలా పడేస్తారు ఎందుచేతనంటే దాని విలువ వారికి తెలియక అలా పడేస్తారు. మీరు కూడా జ్ఞానాన్ని అలా గెంటేస్తారు. మీరు చెడ్డవాళ్ళు అనికాదు దాని విలువ మీకు తెలియటంలేదు. అందుచేత మీకు అక్కరలేదు. దాని విలువ మీకు తెలియటంలేదు కాబట్టి దానిని మీరు కోరుకోరు. దానిని పొందటానికి మీరు ప్రయత్నంచేయరు. కాని అది మనల్ని ఉద్ధరిస్తుంది. జ్ఞానం మన కూడా వచ్చే చుట్టం. ఈశరీరానికి సంబంధించిన చుట్టాలు స్మశానంతో ఆగిపోతారు, పదకొండవరోజు తరువాత మనలను మర్చిపోతారు. కాని జ్ఞానం మన కూడా వచ్చే చుట్టం. అయినా మనం జ్ఞానాన్ని సంపాదించటంలేదు. ఎందుచేతనంటే దాని విలువ మనకు తెలియటంలేదు. దాని విలువ మీకు చెపితే దానిని సంపాదించుకోవటానికి మీరు ప్రయత్నంచేస్తారు, అందుకే ఈటీచింగు.

నేను ఎలా శరణాగతి చెందాలి అని అడుగుతున్నారు. శరణాగతికి, భక్తికి కొంచెం తేడా ఉంది. భక్తిలో దేవుడు ఉంటాడు, జీవుడు ఉంటాడు, ఇద్దరూ ఉంటారు. శరణాగతిలో దేవుడు ఉంటాడు, జీవుడు ఉండడు. నాకు ఏమైనా సంకల్పాలు వచ్చినా నీ సంకల్పమే నెరవేరుగాక. నేనేదో అవ్వాలని అనుకొంటాను, నా గురించి నువ్వేదో అనుకొంటావు. నాకు ఏది మంచిదో నాకంటే నీకే బాగా తెలుసు. అందుచేత నా విషయంలో కూడా నీ సంకల్పమే నెరవేరుగాక. ఇంక అప్పుడు వీడు ఉండడు, వీడు సున్న అయిపోతాడు. భక్తిలో ఇద్దరూ ఉంటారు. అక్కడ ఘర్షణ వస్తుంది. ఇక్కడ ఒకటి అయిపోతాడు. నేను లేను నువ్వే ఉన్నావు. ఒకవేళ నేను ఉన్నాను అనుకొన్నా నాకు కూడా తలంపులు వస్తాయి. ఒకవేళ వచ్చినా నా సంకల్పం నెరవేరకూడదు, నీ సంకల్పమే నెరవేరుగాక. అది నువ్వు సిన్సియర్‌గా అనుకొంటే అదే శరణాగతి. శరణాగతిలో కంప్లీట్ ఫెయిత్ ఉండాలి. అప్పుడు నువ్వు నెమ్మదిగా సున్న అయిపోతావు. ఈశ్వరుడు మిగులుతాడు. అసలు ఇంకో విషయం మనకు ఏది మంచిదో మనకంటే ఈశ్వరుడికే ఎక్కువ తెలుసు. అది మనకు తెలియకపోవటం వలన ఇలా ఉంటే బాగుండును, అలా ఉంటే బాగుండును అనుకొంటాము. అందుచేత ఆయన సంకల్పమే నెరవేరుగాక! అది నువ్వు కంప్లీట్‌గా నీ మనస్సులో మినహాయింపులు లేకుండా అలా అనుకొంటే అది శరణాగతి. నీ అహంకారం నీకు అపకారం చేస్తుంది కాని ఈశ్వరుడు నీకేమి అపకారం

చెయ్యడు. అందుచేత నాకేది మంచిదో నాకు తెలియదు. అసలు నా బాగు నాకంటే నీకే ఎక్కువ తెలుసు. నీ సంకల్పమే నెరవేరుగాక అంటే అప్పుడు ఇక్కడ సంకల్పించే వాడు నెమ్మదిగా సున్న అయిపోతాడు. శరణాగతికి ఫౌండేషన్ విశ్వాసం ఉండాలి. శరణాగతి చేసేవాడికి దుఃఖం ఉండదు. నేను శరణాగతి చెందాను, నా విశ్వాసం నిజం అని నువ్వు అనుకొంటావు. కానీ నీ విశ్వాసం నిజం అని ఈశ్వరుడు అనుకోవాలి కదా! శరణాగతి మార్గం సేఫ్‌సైడ్. ఇప్పుడు గోదావరి నది ఉంది. మనం ఈదుకొని వెళ్ళినా ఆవలి ఒడ్డుకు వెళ్ళవచ్చు, పడవ ఎక్కి వెళ్ళవచ్చు. రమణమహర్షిగారు చెప్పిన నేను ఎవడను అనే విచారణమార్గం ఈదుకొనివెళ్ళటం, పడవమీదవెళ్ళటం శరణాగతిమార్గం. ఈదుకొని వెళ్ళేటప్పుడు మధ్యలో కాళ్ళు చేతులు కదలకపోతే అందులో కొంచెం డేంజర్ ఉంది. శరణాగతిమార్గం సేఫ్‌సైడ్. అందుచేత ఈదటం మానేసి పడవ ఎక్కేయండి అంటున్నారు. మీరు పడవ ఎక్కి వెళ్ళవద్దు అని భగవాన్ చెప్పటంలేదు, ఆయన శరణాగతిమార్గాన్ని యాక్సెప్ట్ చేసారు. మీకు శరణాగతిమార్గం నచ్చకపోతే విచారణామార్గంలోకి రండి అంటున్నారు భగవాన్.

ముందు యర్లీ స్టేజ్‌లో ఈశ్వరుడు ఉన్నాడు అనేటువంటి విశ్వాసం ముఖ్యం. ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు. మన కంట్రోలర్ ఒకడు ఉన్నాడు. ఈ ప్రపంచాన్ని ఎవడైతే సృష్టించాడో వాడే మనల్ని కూడా సృష్టించాడు అని ముందు పెర్సనల్ గాడ్ మీద ఫెయిత్ పెట్టుకోండి. దేలీజ్ ఈశ్వర ఆ మార్గం సేఫ్‌సైడ్. నా గురువు ఎవరో నాకు ఎలా తెలుస్తుంది? ఈశ్వరుడినే గురువుగా పెట్టుకోవాలి. ఈశ్వరుడే నీకు గురువుగా మానిఫెస్ట్ అవుతాడు. నీకు గురువు అనేది లోపల నుండే గైడెన్స్ వస్తుంది, బయట నుండి ఎవరూ చెప్పనక్కరలేదు. గురువు అంటే కేవలం పాఠాలు చెప్పేవాడు కాదు, ఈశ్వరుడు చెయ్యని ఉపకారం కూడా నీకు గురువు చేస్తాడు. నీకు ఎదురయ్యే సంఘటనలను గురువు తప్పించ లేకపోవచ్చు. ఆ సంఘటనలు జరిగిపోతూ ఉంటాయి. ఆ సంఘటనల ప్రభావం నీ మెదడు మీద పడనివ్వడు, నీకు దుఃఖం రానివ్వడు, వాడు గురువు. ఇంక ఆ సంఘటనల వలన నీకు వచ్చే నష్టం ఏముంది? గురువు ఇచ్చే రక్షణ అది. గురువు అంటే చీకటిని తొలగించేవాడు. బయట చీకటిని సూర్యుడు తొలగిస్తాడు. లోపల ఉన్న చీకటిని సూర్యుడు తొలగించలేడు. మన లోపల ఉన్న చీకటిని తొలగించే వాడే గురువు.

మీకు ఏదైనా దుఃఖం వచ్చినా ఇది నిత్యము కాదు అనుకోండి. అది ఎప్పుడూ ఉండదు. అలాగే మీకు ఏదైనా సుఖాలు వచ్చినా అదీ నిజంకాదు. కాలప్రవాహంలో అదీ పోతుంది, ఇదీ పోతుంది. కాలప్రవాహంలో శరీరం కూడా పోతుంది కదా! శరీరమే పోయేటప్పుడు దానికి వచ్చే సుఖదుఃఖాలది ఏముంది? అవీ పోతాయి. ఒకవేళ నీకు మంచిరోజులు వచ్చినా అవి ఎప్పుడూ ఉండవు, చెడ్డ రోజులు వచ్చినా ఎప్పుడూ ఉండవు, అన్నీ

కాలప్రవాహంలో కొట్టుకొనిపోతాయి. ఈ దేహాలు, అవి అనుభవించేకర్మ, ఈ చావులు పుట్టుకలు ఈ అడవిలోనుండి గురువు నిన్ను బయటకు తీసుకొనిపోతాడు. గురువు దగ్గర అనుగ్రహం తప్పించి శిక్షించటం అంటూ ఏమీ ఉండదు. గురువు యొక్క ప్రతీ మాట అనుగ్రహం. అంటే అనుగ్రహంలో నుండే ఆ మాట వస్తోంది. చాకలి బట్టలను రాతిమీద కొడతాడు. ఆ బట్టలను చింపేయటానికి కాదు, వాటికి ఉన్న దుమ్ము పోవటానికి అలా చేస్తాడు. అలాగే ఈశ్వరుడు ఒకోసారి నిన్ను తలుపు సందున పెట్టి నొక్కుతాడు. అంటే నిన్ను బాధపెట్టటానికి కాదు. నీలో ఉన్న చెడును కక్కించటానికి అలా చేస్తాడు. చాకలి బట్టలను కొట్టినట్లు ఒకవేళ గురువు నిన్ను కొట్టినా ఆ నొప్పి నీకు ఏమీ తెలియనివ్వడు. నీకు మత్తు పెడతాడు, వాడు గురువు.

బహుజన్మల కృషి వలనగాని జ్ఞానంరాదు అని పరమాత్మ గీతలో చెప్పాడు. మీకు జ్ఞానం వచ్చినా తంటాయే, రాకపోయినా తంటాయే. రాకపోతే ఇంకా రాలేదు, రాలేదు అనుకొంటారు. వచ్చేస్తే అప్పుడే వచ్చేసింది ఏమిటి అనుకొంటారు. అంటే మీ ఫిజికల్, మెంటల్ లిమిటేషన్స్ పోతాయికదా! అప్పుడు కొంత ఇబ్బంది ఉంటుంది, కొంత భయం కలుగుతుంది. వివేకానందుడిలాంటివాడికి భయం వేసింది. రామకృష్ణుడు వివేకానందుడితో మాట్లాడుతూ మాట్లాడుతూ ఒకసారి స్పిరిట్యువల్ ఎనర్జీని లోపలకు పంపాడు. వాడికి భయం వేసింది. మా అమ్మకు దూరం చేసేస్తున్నావు, మా అమ్మ ఏమైపోతుంది అని కేకలు వేసాడు. రామకృష్ణుడు కంగారు పడలేదు. ఇప్పుడు ఇది సరిపోతుంది. అంతకంటే నిన్ను దూరం తీసుకొని వెళ్లను అని వదిలేసాడు. ఇది రామకృష్ణుడు చేస్తున్నాడని వివేకానందకు అర్థమైపోయింది. మనం చిన్నప్పటి నుండి ఫిజికల్, మెంటల్ లిమిటేషన్స్‌లో ఉంటాము కదా! అందులోనుండి తప్పిస్తే మనకు నేచురల్‌గా భయం వచ్చేస్తుంది. అంటే శరీరం చనిపోతే వేరు, ఇది బతికి ఉండగా తప్పించటం కదా!

భగవాన్ ఏమన్నారు అంటే నువ్వు ఒక దేశానికి రాజువు అయిన, వేలాదికోట్లు నువ్వు సంపాదించినా, నువ్వు ట్రూత్‌ను రీలైజ్ చేయకుండా ఈ ప్రపంచంలో ఏది సాధించినా అది అంతా ఒకటిలేని సున్నలతో సమానము. సత్యానుభవం పొందకుండా మీరు ఎన్ని సాధించినా అది అంతా కూడా స్టుపిడ్ స్టఫ్. నువ్వు విమానాలలో తిరిగినట్లు స్వప్నం వచ్చింది అనుకో, మెలకువ వచ్చాక ఆ విమానాలు నిజం అని అనుకొంటావా? స్వప్నంలో ఉన్నప్పుడు అది అంతా నిజమే కాని మెలకువ వచ్చాక అది నిజం కాదని నీకు తెలుస్తుంది. నీకు రీలైజేషన్ వచ్చేవరకు నేను కష్టపడ్డాను, నేను ఇది సాధించాను అది సాధించాను అని నువ్వు అనుకొంటావు. ట్రూత్‌ను రీలైజ్ చేసాక ఇవన్నీ ఒకటిలేని సున్నాలు, ఇది అంతా డ్రీమ్ స్టఫ్ అని అప్పుడు నీకు తెలుస్తుంది. భయస్తులకు, బద్ధకస్తులకు ట్రూత్‌ని రీలైజ్ చేయటం కష్టం. మనకు

ఐదు సముద్రాలు ఉన్నాయి. ఈ ఐదు సముద్రాలలో ఎంత నీరు ఉందో నీ స్పిరిట్యువల్ హార్ట్‌లో అంత ఆనందం ఉంది. అది నీకు సడన్‌గా మెదడుకు వదిలాడు అనుకో నీకు గాలి అందక చచ్చిపోతావు. అందుచేత ఆయన కంట్రోలులో ఉంచుతాడు. హృదయంలో ఉన్న ఆనందం నీకు అందినప్పుడు ఈ శరీరం కూడా శరీరం కింద ఉండదు, అదీ ఆనందమే. హృదయంలో ఉన్న శాంతిని నీవు ఎంజాయ్ చేసేటప్పుడు కొంత ఎనర్జీ వస్తుంది. జ్ఞానం శక్తి లేకుండా ఉండదు. మాటతో పాటు వెనకాల శాంతి, శక్తి వస్తాయి. అందులో నుండి వాడు ఎస్కేప్ అవ్వలేడు. మనం స్కూలులో మాస్టర్ల కింద ఉండకూడదు. ఎవరైతే వింటున్నారో వారి పట్ల ఎఫెక్షన్ ఉండాలి. టీచింగ్ చేసే వాడికి అది ఫస్ట్ క్వాలిఫికేషన్. వాడి ఇన్నర్‌లైఫ్‌లో మార్పు రావాలి. ఇన్నర్‌లైఫ్‌లో మార్పు రాకుండా వాడు ట్రూత్‌ను రీలైజ్ చేయలేడు. వాడి ఇన్నర్‌లైఫ్‌లో మార్పు తీసుకొనిరావటానికి వారి మీద నీకు ఎఫెక్షన్ ఉండాలి. మన పట్ల ఆయనకు ఆప్యాయత ఉంది, ఆయన మన క్షేమం కోరుతున్నాడు అనే భావన వినేవాళ్లకు కలగాలి. తరువాత నీకు ఎంతవరకు తెలిస్తే అంతవరకు చెపుతావు, అది వేరే విషయం. కాని ముందు వినేవారి పట్ల నీకు ఎఫెక్షన్ ఉండాలి. అది ముఖ్యం.

కైలాసంలో శివుడు ఉన్నాడు కాని ఇక్కడ అరుణాచలంలో ఈ కొండే శివుడు. అరుణాచలం అగ్ని లింగం. అది సీక్రెట్‌గా పని చేస్తుంది. ఇక్కడ వారంలో ఏ రోజున గిరి ప్రదక్షిణ చేస్తే ఏ కోరిక నెరవేరుతుందో వ్రాసారు. భక్తులు తెలివైన వాళ్ళు అయితే ఏ కోరిక కోరకుండా గిరి ప్రదక్షిణ చేసి వచ్చేస్తారు. మీరు కోరికలు కోరితే అవి నెరవేరతాయి. దానితో ఆయనతో ఉన్న సంబంధం తెగిపోతుంది. మీరు ఏమీ కోరకుండా తిరుగుతారు అనుకోండి అప్పుడు మీకు ఏమి ఇవ్వాలని ఆయన ఆలోచనలో పడతాడు, మీ భారం అంతా ఆయన మీద పడుతుంది. మనం ఎవరి దగ్గరకైనా వెళ్ళాము అనుకోండి, మాకు పది రూపాయలు ఇవ్వండి అంటే ఇచ్చేస్తారు, దానితో అయిపోతుంది. అలా కాకుండా మా యోగక్షేమాలు మీరు చూడాలి అంటే ఏమిటి సమస్య అని ఆయన ఆలోచనలో పడతాడు. శివుడు కూడా అంతే. మనం తెలియక ఏదో కోరుకొంటూ ఉంటాము. ఏమీ కోరకుండా తిరిగితే అన్ని కోరికలు నెరవేరతాయి, అంతేకాదు రీలైజేషన్ కూడా వస్తుంది. అయితే ఏమీ కోరకుండా మనం ఉండము కదా! అసలు నువ్వు కోరికలు కోరటానికి నీకేమి కావాలో ఆయనకు తెలుసు కదా! ఆయన అంతర్యామి కదా! ఆయన సర్వజ్ఞుడు. ఇంక నువ్వు అడగటం ఎందుకు? ఆయనకు తెలియదేమో అని మీరు అడిగేస్తున్నారు. మనకు దురద పెడితే గోక్కుంటాము. కోరికలు అడగటం దురదలాంటిది. పైగా మీరు కోరుకున్న కోరికలు నెరవేరతాయి అనుకోండి, ఒకోసారి అది మీకు శిక్ష అవ్వవచ్చు. అందుచేత కోరుకోవటం అనవసరం. మనకేది మంచిదో మనకు తెలియదు. మనకు ఏది మంచిదో ఆయనకు

తెలుసు.

మోక్షం అంటే విడుదల అని అర్థం. అజ్ఞానంలోనుండి విడుదల, అవిద్యలోనుండి విడుదల, నువ్వు కానిది నువ్వు అనుకొంటున్నావు కాబట్టి అందులోనుండి విడుదల మోక్షం. బుద్ధుడు చెప్పింది నిర్వాణస్థితి అంటే వాసనాక్షయం. వాసనలు నిశ్శేషంగా నశించాలి. అప్పుడు ఇంక నీకు శరీరం అవసరం ఉండదు. మానవజాతిని పీడించేవి వాసనలు. నీకు ఏ వాసన అయితే ఉందో, ఏ వాసన అయితే నిన్ను పీడిస్తోందో దానిలో నుండి నిన్ను విడుదల చేయటమే ఆయన గమ్యం. నీకు నిశ్శేషంగా వాసనలు నశించినపుడు ఆ స్థితిని నిర్వాణం అన్నారు. నిర్వాణం అంటే ఆరిపోవటం. నీకు మరల శరీరాలు వచ్చే కారణాలు ఏమీ లేకుండా పూర్తిగా దీపం ఆరిపోవటం. ఈ ఆర్పటం కూడా ఎలాగ అంటే ఇందులో కూడా తేడా ఉంది. లోపల కిరసనాయిలు ఉండగా దీపం ఆర్పేసాము అంటే ఇంకొకడు దానిని వెలిగించవచ్చు, లోపల కిరసనాయిలు ఉంది కాబట్టి దానిని వెలిగిస్తే అది తిరిగి వెలుగుతుంది. అలా కాదు. లోపల ఉన్న కిరసనాయిలు పూర్తిగా అయిపోవాలి, ఆయిలు అయిపోతే మనం దానిని ఆర్పనక్కరలేదు, దానంతట అదే ఆరిపోతుంది. నిన్ను అలా తీసుకుని వస్తాడు బుద్ధుడు. లోపల కిరసనాయిలు ఉంటే ఎప్పటికైనా ప్రమాదమే. అలాగే లోపల ప్రవృత్తి ఉంటే ఎప్పటికైనా ప్రమాదమే. వేసవికాలంలో భూమి మీద గడ్డి ఏమీ ఉండదు, బోడిగుండులాగ ఉంటుంది. రెండు వర్షాలు పడేటప్పటికి పచ్చగడ్డి వచ్చేస్తూ ఉంటుంది. ఆ పచ్చగడ్డి ఎక్కడ నుండి వచ్చింది అంటే లోపల విత్తనం ఉంది కాబట్టి వర్షం పడేటప్పటికి అది పచ్చగడ్డిగా వచ్చేసింది. అలాగే నీలోపల వాసన ఉంటే అది ఎప్పటికైనా ప్రమాదమే. నీకు బాహ్యజీవితం ముఖ్యంకాదు, ఇన్నర్‌లైఫ్ ముఖ్యం.

వాస్తవపరిస్థితులకు దూరంగా ఉండి ఏవో కల్పించుకోవటం, సమస్యలు లేకపోయినా మన మనస్సే ఏదే సమస్యలను కల్పించుకుంటుంది. ప్రతీవాడి మనస్సు కోతే. కోతి ఒక రొబ్బ మీద నుండి ఇంకో రొబ్బ మీదకు ఉరుకుతూ ఉంటుంది. అలాగే మన మనస్సు ఒక తలంపును విడిచిపెట్టేసి ఇంకో తలంపును పట్టుకొంటూ ఉంటుంది. ఎప్పుడూ ఒక తలంపు మీద ఉండదు. ఆచార్యులవారు విశ్వనాధుడితో ఏమన్నారు అంటే నువ్వు నాకు ఏమీ ఇవ్వనక్కరలేదు, నేనే నీకు ఇస్తాను. ఈ మనస్సు అనే కోతితో నేను పడలేకపోతున్నాను ఈ కోతిని నువ్వు తీసేసుకో. నీకు బిక్షకు ఉపయోగపడుతుంది. కొంచెం బియ్యం ఎక్కువ వస్తాయి. నాకు పీడ వదలిపోతుంది. దీని వలన నీకూ లాభమే, నాకూ లాభమే అన్నారు. అందుచేత నువ్వు నాకు ఏమీ ఇవ్వనక్కరలేదు, నేను ఇస్తాను కాని నువ్వు యాక్సెప్ట్ చెయ్యి ఈ మనస్సు అనే కోతిని తీసేసుకో, ఈశ్వరస్వరూపం పొందకుండా ఎవరో పరాయివాళ్ళు అడ్డురావటం లేదు, ఈ మనస్సే కదా అడ్డు. అది చిరిగిపోతే ఏమీ లేదు. మనం చింపలేకపోతున్నాము కాబట్టి తీసేసుకోమంటున్నాడు. మీరు ఎన్ని సాధనలు చేసినా, గిరి

ప్రదక్షిణలు చేసినా మనస్సును చింపటమే గమ్యం.  జీవుడు ఇక్కడే ఉన్నాడు, ఈశ్వరుడు ఇక్కడే ఉన్నాడు.  మనస్సు అనే తెరను తెంపేస్తే ఏమీ లేదు.

మనం ఎన్ని విద్యలు నేర్చుకొన్నా అవి మరణాన్ని దాటించలేవు, నీకు పొట్ట వెళ్ళిపోతూ ఉంటుంది.  మీ శరీరానికి మరణం రాకముందే మనం మరణం లేని స్థితిని పొందాలి.  మనకు ఎన్ని సబ్జక్టులు వచ్చినా లాభంలేదు, మరణాన్ని జయించే విద్య నేర్చుకోవాలి.  మనం అమృత స్థితిని పొందాలి.  శరీరం మరణించేటప్పుడు మన అందరం ఏమనుకొంటాము అంటే మనం పోతున్నాము అనుకొంటాము.  శరీరంతో మనకు తాదాత్మ్యం ఉండటం వలన శరీరం పోయినప్పుడు మనం కూడా పోతున్నాము అనుకొంటాము.  శరీరం మరణించినా మనం ఉంటాము.  అయితే ఉంటామన్న సంగతి మనకు తెలియటం లేదు.  అందుచేత మనకు దుఃఖం వస్తుంది.  అమృతస్థితిని పొందినవాడికి కూడా శరీరం పోతుంది కాని నేను వెళ్ళిపోతున్నాను అని వాడు అనుకోడు.  ఈ శరీరంతో వాడికి తాదాత్మ్యం పోతుంది.  ఏదైతే ఉందో దానితో తాదాత్మ్యం పొంది ఉంటాడు.  శరీరం వాడిదే కాని శరీరం వాడుకాదు.  అందుచేత శరీరం పోయినప్పుడు అది పోతోంది అనుకొంటాడు కాని నేను పోతున్నాను అనే భావన రాదు.  శరీరానికి మృత్యువు వచ్చినా మనకి మృత్యువు లేదు అని ఎవడికైతే అనుభవంలోనికి వచ్చిందో వాడు అమృతుడు.  మీరు ఆ స్థితిని సంపాదించాలి.

అనుకోనేది మన సంకల్పం, జరిగేది ఈశ్వర సంకల్పం.  మనకూ సంకల్పాలు వస్తాయి కాని ఈశ్వర సంకల్పం బలీయమైనది.  మనస్సు లేనిపోని గొడవలు సృష్టిస్తుంది.  మీరు ఏదో అధ్యయనం చేసుకోవటం, జపం చేసుకోవటం, ధ్యానం చేసుకోవటం, ఇంటికి ఉపయోగపడే పనులు చేసుకోవటం లేకపోతే సమాజానికి ఉపయోగపడే పనులు చేయటం ఇవేమీ లేకుండా సోమరితనంగా కనుక ఉంటే దెయ్యాలు మన తలకాయలో మకాం పెడతాయి.  ఇప్పటివరకు మనం ఏమైనా సమస్యలను ఫేస్ చేసినా అవి అన్నీ మన మనస్సు కల్పించినవే, మనమే కల్పించుకోవటం, మనం కల్పించుకున్న సమస్యల పరిష్కారంకోసం మళ్ళీ మనమే తిరగటం ఇలా కాలాన్ని పాడుచేసుకొంటున్నాము.  మనస్సు సత్యంకాదు కాని సత్యానుభవం పొందటానికి మనస్సు సహకారం అవసరం.  అందుచేత మనస్సుతో మీరు విరోధం పెట్టుకోవద్దు, దానితో స్నేహంగా ఉండండి.  మనస్సును మచ్చిక చేసుకోండి, మనస్సును పవిత్రం చేసుకోండి.  అది చెప్పినట్లు మీరు వినవద్దు, మీరు చెప్పినట్లు మనస్సు వినాలి.  అలా మనస్సును తయారు చేసుకొంటే ట్రూత్‌ను రీలైజ్ చెయ్యటానికి అది మీకు సహకరిస్తుంది.

సముద్రంలో కెరటాలు వస్తూ ఉంటాయి.  మీరు స్నానం చేయటం కోసం కెరటాలు ఆగవు.  అందుచేత కెరటానికి, కెరటానికి మధ్యన స్నానం చేసి రండి.  అలాగే జీవితంలో కూడా అనేక సమస్యలు ఉంటాయి.  సమస్యలు ఉన్నాయని సాధన విడిచిపెట్టవద్దు.  ఒక

సమస్యకు ఇంకో సమస్యకు మధ్యన మీ పని పూర్తి చేసుకోండి. ఏవో సమస్యలు వస్తూ ఉంటాయి, ఏవో సంఘటనలు జరుగుతూ ఉంటాయి. వీటి గురించి ఆలోచించి మీ ఎనర్జీ వేస్టు చేసుకోవద్దు. కెరటాలు ఆగిపోయాక సముద్రంలో స్నానం చేద్దాము అనుకోవటం ఎటువంటిదో సమస్యలు అన్నీ పరిష్కారం అయ్యాక మీరు సాధన చేద్దాము అనుకోవటం అటువంటిదే. కెరటానికి కెరటానికి మధ్యన మనం స్నానం చేసి ఎలా బయటకు వచ్చేస్తామో అలాగే సమస్యకు, ఇంకో సమస్యకు మధ్యన మీరు సాధన చేసుకొని శాంతి స్థానానికి చేరుకోండి. మీకు ఏదైనా సందేహాలు వస్తే అడగవచ్చు కాని ఏవో కల్పించుకొని ప్రశ్నలు అడగటం పొరపాటు. పెద్దవారి దగ్గర కూర్చున్నప్పుడు తెలుసుకోవాలి అనే బుద్ధితో ప్రశ్నలు అడగాలి కాని ప్రశ్న కోసం ప్రశ్న అడగకూడదు. మనం అడిగేటప్పుడు వినయంగా అడగాలి, శ్రద్ధగా అడగాలి, తెలుసుకోవాలనే కోరికతో అడగాలి. నీ మొఖంలో అవినయం కనబడకూడదు, హేళనగా ఉండకూడదు. ప్రశ్న అడిగే పద్ధతి అది. అసలు నీకు తెలుసుకోవాలనే బుద్ధి ఉంటేనే వాడి హృదయం ఓపెన్ చేస్తాడు.

కర్మఫలత్యాగికి సంసారం రాదు. మనిషి బేసిక్‌గా స్వార్థపరుడు. అంటే మేము కష్టపడ్డాము కదా, మేమే అనుభవించాలి అన్నట్లుగా ఉంటారు. కర్మఫల త్యాగం ఏమీ చెయ్యరు. అందుచేత వారికి సంసారం వస్తుంది. ఎర్రబట్టలు కట్టుకొన్నవాడు సన్యాసికాదు. కర్మఫల త్యాగి సన్యాసి. ఇంక వాడికి సంసారం రాదు. కర్మఫలాన్ని అనుభవించినవాడు మాత్రమే కర్మ సముద్రంలో పడతాడు. కర్మఫలాన్ని త్యాగం చేసినవాడికి ఇంక సంసారం అంటదు, వాడు కర్మసముద్రంలో పడడు. మనం చిన్న పనిని కూడా పెద్ద మనసుతో చెయ్యటం నేర్చుకోవాలి. నీ చేతిలో ఉన్న కర్మను శుచిగా, ఓర్పుగా చేయటం యోగం కాని అస్తమాను కళ్ళు మూసుకుని కూర్చోవటం యోగం కాదు. మీ ఇంట్లో ఉన్న పెద్దవారిని వాళ్ళు బతికి ఉండగా మీరు బాగా చూస్తే, వారు చనిపోయిన వారి ఆశీస్సులు మీకు ఉంటాయి. దానివలన కూడా మీరు ఐశ్వర్యవంతులు అవుతారు. బ్రతికిఉన్నవాళ్ల గురించి వీళ్ళు ఇంకా చనిపోవటం లేదు ఏమిటి అని అనుకోవద్దు. వాళ్ళు ఉన్నంతకాలం జాగ్రత్తగా చూడండి. చనిపోయినవారి గురించి దుఃఖపడవద్దు. మీరు కనుక శాంతిగా ఉంటే, మీశాంతి వారికి అందుతుంది. ఇతరులను మీరు భయపెట్టవద్దు, ఇతరులను చూసి మీరు భయపడవద్దు. ఇప్పుడు మీరు అరుణాచలం వచ్చినా, కాశీ వెళ్ళినా మీకు ఒక లాభం ఉంది. అసలు మీకు వైరాగ్యం ఎంత ఉందో తెలుస్తుంది. ఇంటి దగ్గర కూర్చుంటే తెలియదు. మీకు వైరాగ్యం ఎంత ఉంది, మమకారం ఎంత ఉంది అనేది ఇంటి దగ్గర ఉంటే తెలియదు. సంవత్సరంలో ఒక నెల రోజులు ఇంటికి దూరంగా ఉంటే అప్పడు మీకు ఇంటిమీద ఎంత మమకారం ఉంది, మోహం ఎంత ఉంది అనేది మీకు తెలుస్తుంది.

సత్యాన్ని దర్శించాలంటే ఈ ప్రపంచాన్ని విడిచిపెట్టి అరణ్యాలలోనో, కొండగుహలలోనో ఏకాంతంగా జీవించాలి అని చెప్పిన పూర్వపు యోగులతో మీరు ఏకీభవిస్తున్నారా అని భగవాన్‌ను అడుగుతున్నారు. దీనికి భగవాన్ ఏమి చెప్పారు అంటే వ్యవహారిక జీవితాన్ని విడిచిపెట్టనక్కరలేదు. మీరు రోజూ చేసుకొనే పనులు విడిచిపెట్టి ఎక్కడికీ పారిపోనక్కరలేదు. మీరు ఇంటి దగ్గరే మీ అనుకూలాన్నిబట్టి ఒక గంటో, రెండు గంటలో జపం చేసుకోండి, ధ్యానం చేసుకోండి. దేవుడు పేరు చెప్పి మీరు చేసే పనులలో అశ్రద్ధ వద్దు. ఇది కంగారుపడితే వచ్చేదికాదు. ఎవరు చేసుకొనేపని వారు చేసుకోవచ్చు. మీరు చేసే జపం, ధ్యానం సక్రమంగా ఉంటే, అలా కొంతకాలం చేసేటప్పటికి నీ ప్రయత్నం అక్కరలేకుండా అది లోపల సహజంగా జరిగిపోతూ ఉంటుంది. మీరు చేసే పని కూడా ధ్యానంతో సమానమే. అది మీరు చాకిరి అనుకొనేటప్పటికి మీకు బరువు అనిపిస్తుంది. కాఫీ కాయటం మీరు చాకిరీ అనుకొంటున్నారు. మీరు ధ్యానం చేసుకొంటున్నారు కదా, కాఫీ కాయటం కూడా ధ్యానం కిందే ఉండాలి. అప్పుడు మీకు స్పిరిట్యువల్ స్ట్రెంగ్త్ పెరుగుతుంది. మీరు ఇంటి దగ్గర చేసుకొనే పని కూడా ధ్యానం కిందే ఉండాలి. అలా మీరు అలవాటు చేసుకోవాలి. మీరు గాలి పీల్చుకొంటున్నారు. కష్టపడుతున్నాము అనుకొంటున్నారా? లేదు. మీరు ఇంటి దగ్గర చేసుకొనే పని కూడా మీకు నార్మల్ అయిపోవాలి. మీరు గుడికివెళ్ళి అభిషేకం చేయించుకుంటే అది చాకిరీ అనుకొంటున్నారా? చాకిరీ అనుకొంటే మీరు చేయగలరా? ఆ పని కష్టం అనుకొంటే మీరు చేయలేరు. అలా అనుకోవద్దు. మీరు ఇంటి దగ్గర చేసుకొనే పనులు కష్టం కష్టం అనుకొంటే రోజూ చేయగలరా? అది నార్మల్ అయిపోవాలి. కొండచుట్టూ తిరగటం భక్తి కాదు, మీరు చేసే కర్మే భక్తి, పనే దేవుడు. నీవు జపం ఎలా చేస్తున్నావో, దేవుడికి అభిషేకం ఎలా చేస్తున్నావో అలాగే పని కూడా భగవంతుడికి పూజ చేస్తున్నట్లుగా ఉండాలి. ఎందుచేతనంటే అంతటా వ్యాపించి ఉన్నవాడు ఆయనే కదా!

మీ కుటుంబసభ్యులు అంటే నీకు ఇష్టం అనుకో. ముందు వాళ్ళయినా చనిపోతారు లేకపోతే మీరైనా చనిపోతారు. చావు చాలా క్రూరంగా ఉంటుంది. మీకు ఆప్యాయతలు ఉన్నా చావు విడదీసేస్తుంది. ఎప్పటికైనా విడిపోవాలి కదా అని తెలివైనవాళ్ళు ముందే ప్రిపేర్ అవుతారు. మనం ఇంటి దగ్గర ఆప్యాయంగా ఉన్నా వీళ్ళు మనం ఎప్పుడో ఒకప్పుడు విడిపోతాము అని లోపల అవగాహన ఉండాలి. దానికి మనస్సు ప్రిపేర్ అవ్వాలి. నీవు మారుమనస్సు పొందితే ఇతరులపట్ల, లోకంలో జరిగే సంఘటనలపట్ల, ఇతర విషయాల ఎడల నీ దృక్పథం పూర్తిగా మారిపోతుంది. నువ్వు పూర్వంలాగ ఉండవు. నీ ఆలోచనా విధానం మారిపోతుంది. నీకు తెలియకుండా, నేను చేస్తున్నాను అనే భావన లేకుండా నీ మనస్సు ధ్యానప్రవాహంలో పడిపోతుంది. సమాజంలో కనిపించే మనుషుల వల్లగాని, మీ ఇంట్లో జరిగే సంఘటనల

వల్లగాని, లోకంలో జరిగే విషయాలవల్ల గాని నీకు ఏమీ అశాంతి రాదు. ఎందుచేతనంటే వాటిపట్ల నీ దృక్పథం మారిపోతుంది. లోపల ధ్యానం దానంతట అది జరిగిపోతూ ఉంటుంది. లోకం ప్రభావం నీ మీదపడదు. ఇతర విషయాలు, ఇతర సంఘటనలు, మమకారాలు, వ్యక్తిభావన ఎప్పుడైతే నిన్ను వదిలేస్తాయో అప్పుడు నీ మనస్సు వెళ్ళి హృదయంలో పడిపోతుంది. దాని గురించి నువ్వు పెద్ద శ్రమ పడనక్కరలేదు.

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 12-08-2016, వేల్పూరు)**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

వేల్పూరుస్వామి ఇక్కడ లైట్‌హౌస్. సముద్రంలో ఓడలు తిరుగుతూ ఉంటాయి. లైట్‌హౌస్‌లు ఎందుకు పెడతారు అంటే అక్కడ భూమి ఉందని సముద్రంలో ఉన్న ఓడలకు తెలుస్తూ ఉంటుంది. మన స్వామీజీ దగ్గరకు చాలామంది భక్తులు వస్తున్నారు. ఆయనను చూసి వెళుతున్నారు. ఇక్కడ మాటలతో చెప్పలేనటువంటి, మనస్సుకు అందనటువంటి ఏదో ఆనందం లభించటం వలననే ఇలా చూసి వెళుతూ ఉంటారు. ఓడలకు లైట్‌హౌస్ ఎలాగో అలాగే మానవజాతికి కొన్ని అశ్రమాలు కూడా అవసరం. అయితే మీరు ఇంటి దగ్గర పనులు ఎవరూ అశ్రద్ధ చేయకూడదు. భగవాన్‌ను వంటింట్లో దేవుడు అంటారు. ఆయన వంటింట్లో ఎక్కువగా పనిచేస్తూ ఉంటారు. కాని నేను చేస్తున్నాను అనే భావన అక్కడలేదు. అంటే పని చేసినా చెయ్యని వాడితో సమానము. మీరు కూడా ఆ స్థాయికి రావాలి. శరీరానికి ఆహారం ఎంత ముఖ్యమో మనస్సుకు శాంతి, సుఖం అంతే ముఖ్యం. భార్యకు అనుకూలమైన భర్త దొరికితే మంచిదే, మీరు అదృష్టవంతులు. అలాగే భర్తకు అనుకూలమైన భార్య దొరికితే వాళ్ళు అదృష్టవంతులే, కాని బాహ్యవిషయాలతో, వ్యక్తులతో సంబంధం లేకుండా మీ హృదయంలో ఉన్న శాంతి మీ సహస్రారానికి అందుతూ ఉంటే మీరు ఇంకా ఎక్కువ అదృష్టవంతులు అని "నా సత్యాన్వేషణ" అనే గ్రంథంలో డాక్టర్ రాధాకృష్ణన్ చెప్పారు.

మాకు ఏమీ దుఃఖం రాకూడదు అని మీరు అనుకొంటారు. దుఃఖం, అశాంతి అంటే ఎవరికి ఇష్టం ఉండదు. అసలు రమణభగవాన్ ఈ భూమి మీదకు రావటమే ఒక నూతన యుగం ప్రారంభమయింది. అంతకుముందు బుద్ధుడు, రామకృష్ణుడు వాళ్ళు చెప్పారు కాని అదంతా సాపేక్షికమైనది. ఇక్కడ సఫరింగ్ లేకుండా, స్ట్రగుల్స్ లేకుండా మీ సారోని ఆర్పేసే విధానం రమణభగవాన్‌ది. పుష్కరస్నానం చేస్తే పవిత్రులు అవుతారు అని హిందూమత సాంప్రదాయం. ఏదో ఒక మతంలో పుట్టాము కాబట్టి మన సాంప్రదాయం ప్రకారం చేయాలనుకొనేవాళ్ళు స్నానాలు చేయవచ్చు. ఆ నదిలో స్నానాలు చేస్తే మీరు పవిత్రులు అయిపోతారా అంటున్నారు బుద్ధుడు. మీరు నదిలో స్నానం చేయటం కాదు మీరు ధ్యానంలో స్నానం చెయ్యండి, ప్రవర్తనలో స్నానం చెయ్యండి, శీలంలో స్నానం చేయండి, జ్ఞానంలో స్నానం

చేయండి అని బుద్ధుడు చెపుతున్నాడు. మీకు దాహం లేనప్పుడు మంచినీళ్లతో పని ఏముంది? మీకు ఆకలి లేనప్పుడు ఆహారంతో పని ఏముంది? అలాగే నువ్వు నూటికి నూరుపాళ్ళు సుఖంగా ఉన్నప్పుడు, శాంతిగా ఉన్నప్పుడు నీకు అసలు దేవునితో పని ఏమిటి? ఉన్నదంతా హృదయంలోనే ఉంది. నేను అందరి హృదయంలో అంతర్యామిగా ఉన్నాను అని పరమాత్మ గీతలో చెప్పాడు. అది ఒక్కటే సత్యం. మన కంట్రోలర్ ఎక్కడో లేడు, మన హృదయంలోనే ఉన్నాడు. తరువాత రాముడిని నేను, కృష్ణుడిని నేను అని చెప్పాడు. అవి అన్నీ సాపేక్షిక సత్యాలు. మనకు ఉపాసనకి రాముడు, కృష్ణుడు ఉపయోగపడతారు. సత్యం అనేది నిరాకారం, నిర్గుణం. కాని ఉపాసన కోసం సాకారంగా, సగుణంగా మనం మార్చుకున్నాము. అయితే ఈ సాకారం కూడా నీ మనస్సు ఎంత నిజమో అది కూడా అంతే నిజం. జగత్తు, జీవుడు, ఈశ్వరుడు మూడూ త్రిరత్నాలు అని వైష్ణవసాంప్రదాయంలో చెపితే మూడూ ఒక ముద్ద అయిపోవాలని భగవాన్ చెప్పారు.

నీ హృదయంలో ఒక నిజం ఉంది, అది ఇప్పడూ ఉంది, ఎప్పడూ ఉంటుంది. ఆల్ రెడీ ప్రజంట్, ఆల్వేస్ ప్రజంట్. నీ శరీరం కంటే, నీ మనస్సుకంటే, నీ ఇంద్రియాలకంటే నీ తలంపుల కంటే అతి సన్నిహితంగా అది నీ హృదయంలోనే ఉంది. బహుజన్మల కృషి ఉంటేనే గాని అది నీకు అందదు అని గీతలో భగవంతుడు చెప్పాడు. ఆ శ్లోకాన్ని ఎవరో భగవాన్‌కు చదివి వినిపించారు. గీతలో అలా చెప్పాడా అది ఇక్కడే ఉంది, ఇప్పడే ఉంది. నువ్వేదో ప్రయత్నం చేస్తే వచ్చేది కాదు. నువ్వు కళ్లు మూసుకుని కూర్చుంటే వచ్చేదికాదు. అది ఎప్పడూ ఉంది. ఇక్కడ ఉన్నదానిని, నీ మనోదేహములకంటే సమీపములో ఉన్నదానిని అందుకోవటానికి నీకు బహుజన్మల కృషి అవసరమా, అదేమిటి? అన్నారు. ఇది రివల్యూషన్. వాడు భగవాన్. మౌనం మంచిది అని ఇక్కడ బోర్డు పెట్టారు. మౌనం మంచిదే. మౌనంతోటి చెప్పవచ్చు, చూపుతోటి చెప్పవచ్చు. ఒన్ లుక్ ఈజ్ ఎనఫ్, ఒన్ వర్డ్ ఈజ్ ఎనఫ అని అక్షరమణమాలలో చెప్పారు కదా! ఒక్కసారి మీ వంక చూస్తే చాలు, ఆ చూపు నీ హృదయంలో ఉన్న సత్యాన్ని నీకు పట్టి ఇస్తుంది. ఒక్క మాట చాలు, ఆ మాట నిన్ను హృదయలోయలలోనికి తీసుకొని పోతుంది. భగవాన్ మాట్లాడే మాట దేవుడై ఉన్నది, అది సత్యమై ఉన్నది. ఇంటి దగ్గర మనం అవసరం లేకుండా ఎక్కువగా మాట్లాడుతూ ఉంటాము. అవసరం లేకుండా మాట్లాడితే ఆ మాటల వలన అహంభావన పెరుగుతుంది. అవసరమైతేనే మాట్లాడాలి. అసలు నీకు మాట ఎందుకు వస్తోంది నీ గొప్పతనం తెలియపరచుకోవటానికా, నీ అహంభావనను వ్యక్తం చేసుకోవటానికా, అది చూసుకో. అవసరమైతే మాట్లాడు, అవసరం లేకపోతే మాట్లాడవద్దు, అది కూడా మౌనమే. ఆస్‌బోర్న్ చాలా తక్కువ మాట్లాడతారు. మీకు గర్వం ఎక్కువ అని ప్రజలు అనుకొంటారేమో అంటే ఎవరో అనుకొంటే నాకు ఎందుకు? నాకు గర్వం ఉందో లేదో నాకు తెలుసుకదా! నాకు నిజంగా గర్వం ఉంటే, నాకు గర్వం లేదు అని ప్రజలు అనుకొంటే

నాకు కలిసివచ్చేది ఏమిటి అవసరం అయినప్పుడు మాట్లాడతాను, అవసరం లేకుండా మాట్లాడను. ఇతరులు అనుకోవటాలతోటి నాకు సంబంధం లేదు. నేను ఎలా ఉన్నానో అలాగే ఉంటాను. మీరు అనుకున్నట్లు నేను ఉండాలా? అలా ఉండలేను నా పద్ధతిలో నేను ఉంటాను. నేను ఎలా ఉండాలో అలాగే ఉంటాను.

భగవాన్ ఏమంటున్నారు అంటే సత్యం నీ హృదయంలోనే ఉంది. నీ హృదయంలో ఏదైతే ఉందో అదే అంతటా వ్యాపించి ఉంది. నీ హృదయంలో ఉన్నది వేరు, అంతటా వ్యాపించి ఉన్నది వేరు కాదు. ఉన్నది ఒక్కటే. అది మాటలకు అందదు, నీ మనస్సుకు అందదు. కాని లేదా అంటే ఉంది. అక్కడ శాంతి ఉంది, సుఖం ఉంది. హృదయంలో ఉన్న సత్యాన్ని అనుభవైకవేద్యం చేసుకొన్నప్పుడు సముద్రంలో ఎంత నీరు ఉందో అంత సుఖం, శాంతి నీకు అనుభవంలోనికి వస్తుంది. అప్పుడు ఈ ప్రపంచం అంతా నీకు గడ్డిపరకలాగ అనిపిస్తుంది. ఈ మధ్య మా ఇంటికి ఒక స్వాములవారు వచ్చారు. దానికి వేరుగా ఉండాలా, లేకపోతే ఐక్యమవ్వాలా అంటున్నారు. నది వెళ్ళి సముద్రంలో ఐక్యమవుతుంది. సముద్రంలో కలిసాక ఇది గోదావరి నీరు, ఇది కృష్ణానది నీరు అని ఏమీ తెలియదు. అందులో ఐక్యమైపోతే సుఖం ఎక్కడ నుండి వస్తుంది, సుఖం అనుభవించాలి అంటే సెపరేట్‌గా ఉండాలి కదా అని స్వాముల వారి ఉద్దేశం. దాని స్వరూపమే సుఖం, అది నీవై ఉన్నావు. అది నీకు అనుభవంలోనికి వచ్చినప్పుడు దానిని అదే ఎంజాయ్‌చేస్తూ ఉంటుంది, నువ్వు సెపరేట్‌గా ఉండనక్కరలేదు. భగవాన్ టెక్నిక్ ఎక్కడ ఉంది అంటే పుష్కరాల స్నానాలు చేస్తే పవిత్రులు అవుతారు అని అందరూ చెపుతున్నారు కదా! అయితే అంతకు ముందు మీరు పవిత్రంగా లేరా? ఇప్పుడు మీరు అపవిత్రంగా ఉన్నారా? నీ హృదయంలో ఏదైతే సత్యం ఉందో దానికీ నీ మనోదేహములకు ఇసుమంతయు సంబంధంలేదు. అయితే దానితో నీకు తాదాత్మ్యం లేదు. అది ఎప్పడూ పవిత్రంగానే ఉంది. నువ్వు నదిలో స్నానం చెయ్యటంవలన అది పవిత్రం అవ్వదు. అంతకు ముందే అది పవిత్రంగా ఉంది. అయితే మేము పవిత్రులం అయిపోతాము అనే భావన ఎక్కడనుండి వస్తోంది. అంటే మనిషి మనో దేహములకు పరిమితమై జీవిస్తున్నాడు, దాని వలన ఇటువంటి భావాలు వస్తున్నాయి. ఇక్కడ బుద్ధుడు ఒక పిలుపు ఇచ్చాడు. మీరు శీలంలో స్నానం చెయ్యండి, మీ బిహేవియర్ పేట్రన్‌లో స్నానం చెయ్యండి, మీరు స్వరూప జ్ఞానంలో ములగండి అని చెప్పాడు.

జీవితం అంతా తలంపులే. సంతోషం ఒక తలంపు, దుఃఖం ఒక తలంపు, మీరు ఎప్పడైనా బెంగపెట్టుకొంటారు, ఆ బెంగ కూడా తలంపే. ఆ బెంగ పెట్టుకొనే వాడవు నువ్వా లేకపోతే నీ హృదయంలో సుఖస్వరూపంగా ఉన్న వాడవు నువ్వా? ఎవడు నువ్వు? నేను దేహాన్ని, నేను మనస్సును, నేను మంచివాడిని, నేను చెడ్డవాడిని అని ఇలా మీరు అనుకోవచ్చు.

ఇలా నువ్వు ఎన్ని అయినా అనుకోవచ్చుకాని నువ్వు ఏదిగా ఉన్నావో అదే నువ్వు. అయితే దానిని తెలుసుకొంటే సుఖం అది తెలియకపోతే దుఃఖం నిన్ను వెంటాడుతుంది. ఈ స్వామి ఇక్కడ కూర్చున్నారు. ఈ స్వామి సుఖపడుతున్నారే, మనం కూడా స్వామి లాగా అవ్వాలి. అది సంకేతం. మనకు అన్నీ ఉండి దుఃఖపడుతున్నాము. ఏమీ లేకుండా ఈ స్వామి సుఖపడుతున్నారు ఏమిటి? ఆచార్యులవారు ఏమన్నారు అంటే స్త్రీకి భర్త ఎవరు అంటే శాంతే నిజమైన భర్త. నీకు నూటికి నూరుపాళ్ళు శాంతి దొరికినప్పుడు భర్తతోటి ఇంక నీకు పని ఏముంది? నీకు ఎక్స్టర్నల్ ప్లెజర్ కావాలన్నప్పుడు భర్తకావాలి. టీచింగ్‌లో ఎక్కడా రాజీ లేదు. ఇది సైన్స్ కాదు. నూటికి నూరుపాళ్ళు సత్యం. అలాగే భర్తకు నూటికినూరుపాళ్ళు శాంతి చేతిలో ఉన్నప్పుడు ఇంక భార్యతో వాడికి పని ఏమిటి? అలాగని పెళ్ళిళ్ళు చేసుకోవద్దని కాదు. స్త్రీకి నిజమైన భర్త ఎవరు అంటే శాంతే, పురుషుడికి నిజమైన భార్య ఎవరు అంటే శాంతే. ఆ సుఖం, శాంతి దొరికితే నీ మనస్సు అసలు బహిర్ముఖం అవ్వదు. మన మనస్సు ప్లెజర్స్ కోసం బహిర్ముఖం అవుతోంది. ఇంటి దగ్గర చిరాగ్గా ఉంది, గొడవ గొడవగా ఉంది సినిమాకు వెళ్ళి వచ్చేస్తాము అంటారు. అలా సినిమాలో ఉన్న ఆ రెండు గంటలు ఈ గొడవలు మర్చిపోతారు. తరువాత ఇంటికి వచ్చేయాలి కదా మరి! మరల గొడవ ప్రారంభమవుతుంది. అలా ఎస్కేప్ అవ్వటంకాదు, ఫేస్ ఇట్. నీకు దుఃఖం ఎక్కడ నుండి వస్తోంది అని చూసుకుని దానిని పరిష్కారం చేసుకోవాలి కాని ఇలా సినిమాలు అని, కాశీరామేశ్వరం అని ఎన్నాళ్ళు పారిపోతావు. భగవంతుడు ఏమని చెప్పాడు అంటే మీరు బయటనుండి ఇంద్రియాల ద్వారా తీసుకొన్న ప్లెజర్స్ అన్నీ దుఃఖంగా మారిపోవును. ఇది సత్యం. ఇక్కడ భగవాన్ మిమ్మల్ని నమ్మమని ఏమి చెప్పరు, ఇక్కడ నమ్మకాలతో పనిలేదు.

నువ్వు ఏదిగా ఉన్నావో దాని స్వరూపమే సుఖం, దాని స్వరూపమే శాంతి, దాని స్వరూపమే ఆనందం, దాని స్వరూపమే ఉండటం. భగవాన్ ఒక విషయంలో పొంగిపోయారు. నేను ఉన్నాను, ఆ ఉన్నదేదో నేనై ఉన్నాను. ఇది బైబిల్. ఇది సత్యం. మీకు అందరికీ ఉండాలని ఉందా, చనిపోవాలని ఉందా? అందరికీ ఉండాలనే ఉంది. అదే దేవుడు. ఈ శరీరం చనిపోయినప్పుడు మీరు చనిపోరు. మీరు చావులేనివస్తువై ఉన్నారు. శరీరం చనిపోయేటప్పుడు మేము చనిపోతున్నాము అంటారు, అది నిజంకాదు, అది తలంపే. ఒక్క సత్యం తప్పించి మిగతావి అన్నీ మనస్సు యొక్క కల్పితం. ఈ జన్మలు, శరీరాలు, స్నేహితులు, చుట్టాలు అంతా మనో కల్పితం నిన్ను ఒకడు భార్య అంటాడు, ఒకడు అమ్మ అంటాడు, ఒకడు చెల్లెలు అంటాడు. ఇందులో ఎవరు నువ్వు. ఎవడి కోణంలో నుండి వాడు చూస్తున్నాడు. ఉండటం అనేది, సత్యం అనేది నువ్వు అనుకొన్నట్లుగా లేదు. అది ఎలా ఉండాలో అలా ఉంది. నేను ఉన్నాను, ఆ ఉన్నదేదో నేనై ఉన్నాను ఇది నీకు అనుభవంలో లేదు. నువ్వు ఏదిగా

ఉన్నావో ఆ ఉండటం అనేది నీకు అనుభవంలోనికి వచ్చినప్పుడు నువ్వు ఏది మాట్లాడినా అది ఫైనల్ వర్డ్. నీకు రీలైజేషన్ లేకుండా ఏమి చెపుతావు. అవుటాఫ్ ప్యూరిటీ అండ్ సైలెన్స్ కమ్స్ ద వర్డ్ ఆఫ్ పవర్.

నేను ఇంతవరకు నా జీవితంలో భగవాన్‌కు పూజలు చేయలేదు అంటే మనలో మనం ఏమి చేసుకొంటాము. నన్ను ఆయన తీసుకొన్నారు కాని నేను ఆయనను పట్టుకోలేదు. నేను పట్టుకొని ఉంటే ఈపాటికి విడిచిపెట్టేసేవాడిని, ఈపాటికి డైవర్స్ అయిపోదును. అదే పులి నోట్లో పడ్డ మాంసపు ముక్క. పులి నోట్లో పడ్డ మాంసపు ముక్క బయటకు రావటానికి అవకాశం లేదు అలాగే ఆయన అనుగ్రహంలో పడ్డవాడు కూడా అంతే. జీవలక్షణాలను కాపాడుకొందాము, ఇక్కడ నుండి ఎస్కేప్ అయిపోదాము అని పోరాడినా ఆ జీవలక్షణాలను మిగల్చకుండా తినేస్తాడు. ఏదో మనం మిగిలిపోదాము అని పోరాడినా మనల్ని మిగలకుండా చేసేస్తాడు, సెపరేట్‌నెస్ తీసేస్తాడు. మీరు వేరు, నేను వేరు అనే భావనలో నుండే దుఃఖం వస్తోంది కదా, ఆ వేరు భావనను తొలగిస్తాడు. బుద్ధుడు ప్రయత్నం చేసినా, భగవాన్ ప్రయత్నం చేసినా, వేల్వూరు స్వామి ప్రయత్నం చేసినా మిమ్మల్ని సారోలెస్ స్టేట్‌కు తీసుకునిపోవటానికే. మీకు తినటానికి తిండి ఉంది, కట్టుకోవటానికి బట్టలు ఉన్నాయి, మీకు డబ్బు ఉంది, ఇంటి దగ్గర అన్నీ ఉన్నా మీకు ఎంతోకొంత దుఃఖం ఉంది కదా! సారోలెస్ స్టేట్ అనేది మీకు డబ్బు ఉందని బజారులో కొనుక్కొనేది కాదు. దుఃఖం ఎక్కడ లేదో అక్కడకు తీసుకొనిపోవటానికే ఇక్కడ స్వామి ఉన్నారు. సెల్ఫ్‌లెస్ సెల్ఫ్‌కి సెల్ఫ్ తెలుస్తుంది అని ఈ మధ్య మా మిత్రుడు అంటున్నాడు. అంటే ఏ సెల్ఫ్‌కైతే స్వార్థం లేదో ఆ సెల్ఫ్‌కు ట్రూత్ తెలియబడుతుంది అని చెప్పటం. సెల్ఫ్‌లెస్‌సెల్ఫ్‌కి సెల్ఫ్ తెలియబడుతుంది, వండర్‌ఫుల్ ఎక్స్‌ప్రెషన్. వాడు ఏమతంలో ఉన్నా, ఏ కులంలో ఉన్నా ప్రపంచంలో ఏ స్వార్థపరుడికైనా ఇంతవరకూ సత్యం తెలియబడిందా అంటే లేదు. దేహగతమైననేనును కేంద్రంగా పెట్టుకొని జీవించేవాడికి ఎవడికీ ఇంతవరకు దైవసాక్షాత్కారం జరగలేదు.

భగవాన్ ఏమంటున్నారు అంటే ఓ అరుణాచలేశ్వరుడా నీకు కళ్ళు లేవు. కళ్ళు లేకుండా మొత్తం సృష్టినంతా చూస్తున్నావు. కళ్ళు లేకుండా చూస్తున్న నిన్ను చూడగలిగిన వాడు ఎవడైనా ఈ సృష్టిలో ఉన్నాడేమో ఒకసారి చూడవయ్యా. వాడే జ్ఞాని, వాడే ఈ స్వాములవారు. సత్యం నీ హృదయంలో ఉంది. దానికోసం నువ్వు పైకి ఎగరటంకాదు, లోపలకు డీపెన్ అవ్వాలి. ఇప్పుడు మేము జిన్నూరు నుండి వచ్చాము. జిన్నూరు నుండి ఎంత దూరం అయితే వచ్చామో అంతదూరం వెనక్కివెళితేగాని జిన్నూరు చేరుకోలేము. అలాగే మీ స్వరూపాన్ని విడిచిపెట్టి మీరు ఎంత దూరం వచ్చేసారో మరల అంతదూరం వెనక్కి వెళితేనేకాని మీరు గమ్యాన్ని చేరుకోలేరు. స్టాప్ నాట్ టిల్ ది గోల్ ఈజ్ రీచ్డ్ ఇది స్వామీజీ గర్జన. ఇక్కడ భగవాన్ టెక్నిక్

చూడండి. వండర్‌ఫుల్ ప్రజంటేషన్. ఇక్కడ ఉంది భగవాన్ వైభవం, అది చెప్పటానికే మేము జన్మించాము. భగవాన్ ఏమంటున్నారు అంటే గోల్‌కు వెళ్ళిపోతాను, గోల్‌కు రీచ్ అయిపోతాను అంటున్నారు, ఇప్పుడు నువ్వు గోల్‌కు విడిగా ఉన్నావా? ఒకవేళ గోల్‌కు విడిగా ఎవడైనా ఉన్నాడు అనుకొంటే వాడిని చూడు, అప్పుడు వాడు పోతాడు, నువ్వు గోల్ అయిపోతావు. ఏమిటి నువ్వు గోల్‌కు వెళ్ళిపో అంటున్నావు. నువ్వు ఎక్కడ ఉన్నావు, గోల్ ఎక్కడ ఉంది? గోల్‌కు భిన్నంగా నువ్వు ఉన్నావా? ఒకవేళ ఉంటే వాడు ఎవడు? వాడే ఫాల్స్ ఐ. రిమూవ్ ఇట్ అని చెపుతూ ఉంటే మరల భగవాన్ నన్ను తిడుతున్నాడు. రిమూవ్ ఇట్ అని చెపుతున్నావు, అసలు వాడు ఉన్నాడా రిమూవ్ చెయ్యటానికి, వండర్‌ఫుల్ టీచింగ్. చెవులు ఉన్నవాళ్ళు అందరూ వినండి. నేను తెలుసుకోవాలి, నేను గమ్యాన్ని చేరుకోవాలి అనుకొనే వాడు ఉన్నాడా? వాడు ఉన్నాడేమో చూడు. వాడు లేడు కాబట్టి లేకుండా పోతాడు. అప్పుడు నీవు ఏదిగా ఉన్నావో అది నీకు వ్యక్తమవుతుంది.

పనికి జ్ఞానానికి విరోధంలేదు. మీ ఇంటి దగ్గర చేసుకొనే పనుల విషయంలో అశ్రద్ధగా ఉండకండి. మీరు చేతులతో పని చేసినంతమాత్రం చేత మీకు వచ్చే జ్ఞానం ఆగిపోదు. చేతులను పనిమీద ఉంచండి, మనస్సును భగవంతుడిమీద ఉంచండి. మీ కుటుంబ సభ్యులను వాళ్ళు మావాళ్ళు, మావాళ్ళు అనుకోవద్దు. వాళ్ళు కూడా దేవుడి మనుషులే అనుకొని పనిచేయండి. అప్పుడు అది ధ్యానం అయిపోతుంది. మన ముక్కులో గాలి బయటకు పోతే వాళ్ళకు మనకు సంబంధం ఏముంటుంది? ప్రపంచంలో ఇంతమంది ఉండగా వాళ్ళనే మన ఇంటికి ఎందుకు పంపాడు? వాళ్ళకు మీకు పూర్వజన్మలో ఏదో సంబంధం ఉంది కాబట్టి పంపాడు. వాళ్ళు మీ మనుషులు కాదు, దేవుడి మనుషులే అనుకొని పనిచేయటమే, అది దేవుడి పనే అనుకొని చెయ్యండి. అది కూడా సాధనే. మీ ఇంట్లో ఎవరైనా ముసలివాళ్ళు ఉంటే వాళ్ళు ఎప్పుడు వెళ్ళిపోతారు అని కనిపెట్టుకొని ఉండకండి. వాళ్ళను ప్రేమగా చూడండి, వారికి సేవ చెయ్యండి. ఈ మధ్యన ఒక కోడలిని అడిగాను ఎందుకు ఈ ముసలమ్మగారికి ఇంత సేవ చేస్తున్నారు అని, ఆ కోడలు ఏమి చెప్పింది అంటే ఈవిడ మా అత్తమ్మ, ఇప్పుడు ఆవిడ జీవించి ఉంది కాబట్టి నేను సేవ చేస్తున్నాను. ఆవిడ చనిపోతే ఎవరికి చేస్తాను. ఒకవేళ నాకు సేవ చేయాలని ఉన్నా ఇంక ఎవరు మిగులుతారు. ఇప్పుడు మా అత్తగారిని నేను వదిలేస్తే మా కోడలు కూడా నన్ను వదిలేస్తుంది కదా! ఇది చెడ్డ సాంప్రదాయం అయిపోతుంది కదా! అని చెప్పింది.

నాకు పునర్జన్మ వస్తుందా? నేను మళ్ళీ పుడతానా? అని బుద్ధుడిని అడిగితే ఆయన లాజిక్కు వినండి. నీకు అవసరం ఉంటే శరీరం వస్తుంది, నీకు అవసరం లేకపోతే నీకు రీబర్త్ రాదు. నీకు శరీరం అవసరమా, ఏమి చేసుకొంటావు. నీకు ఎంజాయ్‌మెంట్స్ కావాలి అంటే

శరీరం కావాలి. నీకు ఆకలి లేనప్పుడు అన్నం ఎందుకు? అలాగే నీకు ఎంజాయ్‌మెంట్స్‌తో పని లేదు అనుకో ఇంక నీకు శరీరం ఎందుకు? శరీరం నీకు అవసరం ఉందో లేదో ఇప్పుడు నీకు తెలియటంలేదా? దీనికోసం పురాణాలు చదవాలా? నువ్వు అంత తెలియకుండా ఉన్నావా? ఈమధ్య జినూ్నరులో నన్ను ఒక ప్రశ్న అడిగారు దానికి సమాధానం చెప్పలేకపోయాను. మీకు భక్తులంటే ఇష్టమా లేకపోతే భక్తులకు మీరంటే ఇష్టమా అని. ఈ ప్రశ్నకు అసలు సమాధానం ఉందా. భగవంతుడు భక్తులు సెపరేట్ కాదు. మీ శరీరాన్ని మీరు ఎలా చూసుకుంటారో అలాగే భగవంతుడు కూడా తన భక్తుల శరీరాన్ని చూస్తాడు. అది పరాయి శరీరంకింద చూడడు. తన శరీరంకిందే చూసుకుంటాడు. మాది కర్మమార్గం. మాది జ్ఞానమార్గం అని ఇలా చెప్పకండి. కర్మయోగం, భక్తియోగం, ధ్యానయోగం, జ్ఞానయోగం అని భగవంతుడు నాలుగు యోగాలు చెప్పాడు. మన బుద్ధి పక్వానికి రావాలంటే ఏదో ఒక్క యోగం సరిపోదు, నాలుగు యోగాలు అవసరమే. మీరు 24 గంటలు జపం చేయగలరా? 24 గంటలు ధ్యానం చేయగలరా? మనం చేసుకొనే పని ఏదో మనం చేసుకోవాలి. భక్తి విడిచిపెట్టకూడదు, విచారణ విడిచిపెట్టకూడదు. ఏది సత్యం, ఏది అసత్యం, ఏది మనం తీసుకోవాలి, ఏది మనం వదిలేయాలి, ఏది నిత్యం ఏది అనిత్యం ఆ డిస్క్రిమినేషన్ విడిచిపెట్టకూడదు. మన డ్యూటీ ఏదో మనం చెయ్యాలి, ఈశ్వరుని పాదాలయందు భక్తి కలిగి ఉండాలి. మీపట్ల నాకు ఉన్న ఆప్యాయత వలన విడిచిపెట్టలేక సబ్జక్టు ఇలా చెప్పుకొని పోతున్నాను. మీరు ఎక్కడ చెప్పినా ఒక గంట కంటే ఎక్కువ చెప్పవద్దు అని రామకృష్ణమఠ్ స్వాములు నాకు చెపుతారు. మీలా నేను ఉండలేను, మీ పద్ధతి మీది, మా పద్ధతి మాది అని చెప్పాను.

మీలో చాలామంది డబ్బు ఉన్నవాళ్ళు ఉన్నారు, మీకు డబ్బు ఉంటే దాచుకోండి, అంతేగాని మీకు డబ్బు ఉందని ఖరీదైన బట్టలు వేస్తే, మీరు లగ్జరీగా ఉంటే మీకు తెలియకుండా దేహభావన పెరిగిపోతుంది. మీకు డబ్బు ఉంటే దాచుకోండి అంతేగాని హృదయంలో మటుకు మేము ధనవంతులం, మేము ధనవంతులం అని అనుకోవద్దు. హృదయంలో పేదవాళ్ళ కిందే ఉండండి. అలా ఉండకపోతే మీకు జ్ఞానం రాదు. డబ్బు సంపాదించటం కంటే డబ్బును సద్వినియోగం చేయటం చాలా కష్టం. జాగ్రత్తగా ఉండటం మంచిదేకాని లోభిత్వం ఉండకూడదు. డబ్బును సద్వినియోగం చేయండి లేకపోతే దాచుకోండి కాని మాకు డబ్బు ఉందని మీరు అవసరాలు పెంచుకోవద్దు. సమాజంలో అనేకమంది మంచిపిల్లలు ఉన్నారు. వాళ్ళకు చదువులు బాగా వస్తాయి కాని వారి దగ్గర డబ్బు ఉండదు. అటువంటి వారికి మీ డబ్బును ఉపయోగించండి. ఇందులో గివర్ అని, టేకర్ అని లేదు. ఐశ్వర్యం అంతా ఈశ్వరుడిదే. భగవాన్ దగ్గర హాలులో చాలామంది కూర్చున్నారు. వీరందరు ఎవరు అని భగవాన్‌ను ఒకరు ప్రశ్నించారు. వీరందరూ మనవారే. మనవారు కాబట్టే మన దగ్గరకు వచ్చారు, మనవారు కాకపోతే మన దగ్గరకు ఎందుకు వస్తారు అన్నారు భగవాన్.

అక్టోబర్ 16 జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

**- Mahabharatha**

# ఉత్తమ పురుషార్థం

పరమాత్మ అంటే చిదాకాశస్వరూపం, ఆనందస్వరూపం, ప్రేమస్వరూపం. "సత్యం, జ్ఞానం, అనంతం, బ్రహ్మ" అన్నది ఉపనిషత్ వాక్యం. కాబట్టి సృష్టిలో ప్రతి అణువూ పరమాత్మ స్వరూపమే! శుద్ధ చైతన్యమే! అట్టి పరమాత్మ ఉనికి కన్న భిన్నముగా, వ్యక్తి యొక్క ఉనికి లేదు. స్వరూపం, ఆత్మ, చైతన్యం, మోక్షం, ఎరుక, గురువు, అనుగ్రహం, ఈశ్వరుడు, ఇవన్నీ ఒకే సద్వస్తువు యొక్క పర్యాయపదములు. అట్టి శుద్ధచైతన్యమే సకల జీవులలోనూ హృదయమై ప్రకాశిస్తోంది. అందువల్లనే "నీ స్వరూపమే శాంతి, నీ స్వరూపమే మోక్షం" అంటారు భగవాన్ శ్రీరమణమహర్షి. అట్టి స్వరూప అమృతస్థితిని మనకు అనుభవైకవేద్యం కాకుండా మన అహంకారమే అడ్డుగా నిలుస్తోంది. 'నేను-కర్తను' అని భావించి, కర్మను ఆచరిస్తూ, కర్మఫలితాలపై ఆసక్తిని పెట్టుకోవడం వల్ల బంధం ఏర్పడుతోంది. స్వస్వరూపాన్వేషణ మనలను జనన మరణ సంసారాన్ని దాటించి, ముక్తి తీరాన్ని చేర్చే నావ అవుతుంది. జీవుడు, జగత్తు, ఈశ్వరుల యొక్క అభేదత్వాన్ని గ్రహించకపోతే మనకు మోహభ్రాంతి నుండి విడుదల లభించదు. 'దేహమే-నేను' అనేడి భ్రాంతినుండి విముక్తిని సద్గురువు అనుగ్రహంచేతనే పొందగలము. అహంకారాన్ని విడిచిపెట్టకుండా ఆత్మజ్ఞానాన్ని ఆశించడం, ఎడారిలో మంచినీళ్ళు వెదకడంలాంటిది. అహంకారం నశిస్తేనే అధిష్ఠానమైన ఆత్మ 'తాను'గా అనుభవైకవేద్యం అవుతుంది. పరమాత్మ కన్న భిన్నముగా దేనినైనా గుర్తించడమే భయమునకు, దుఃఖమునకు కారణము. అంతర్దృష్టిని అలవరచుకొని, నాచేత గుర్తింపబడే దేహేంద్రియమనోబుద్ధులు 'నేను' కాదని, నా స్వరూపమే ఆత్మ అనేడి ధృడమైన ఆత్మనిష్టలో ఉండాలి. మనము 'నేను' అంటాము ఆ 'నేను'కు మరో పేరేముక్తి. నేను నిత్యముక్తుడను అన్న ఎరుకయే నిజమైన సాధన. అహంకారాన్ని విచారణచేసి, దాని మూలమైన చైతన్యములో నశింపజేసి, కేవల అమృతస్థితిని 'తాను'గా 'నేను'గా అనుభవైకవేద్యం చేసుకోవడమే ఉత్తమపురుషార్థం.

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# ఆలోచించేవాడు ఉంటేనే - ఆలోచనలు వస్తాయి

సంకల్పముతో కలిసి ఉండటమే బంధము. అట్టి సంకల్పమును విడిచిపెట్టటమే మోక్షము. ఆ అభ్యాసాన్ని వదలకుండా ఉండాలి. వాస్తవాన్ని అవగాహన చేసుకోవటానికే మనం జన్మించాము. జన్మించటానికి ఏ ప్రయత్నం చేస్తున్నాము? ప్రతీదీ దాని మానాన్ని అది జరుగుతుంది. మరి ఎందుకు ఈ బాధ? జీవితాన్ని దాని ప్రవాహంలో దాన్ని వెళ్ళనియ్యాలి. ప్రవాహానికి ఎదురీదవద్దు. కేవలం ప్రవాహంలో తేలుతూ ఉండాలి అది ఎక్కడికి తీసుకొనివెళితే అక్కడకు తీసుకొనివెళుతుంది. ప్రకృతిసిద్ధంగా ఉండాలి. అసహజంగా ఉన్నది వదిలివేయాలి. భగవాన్ ఆశ్రమ నిర్మాణంలో ఒకరు "వంట శాల ఇక్కడ ఉండాలి, ధ్యాన మందిరం అక్కడ ఉండాలి" అంటూ ఉంటే భగవాన్ "ఏది ఎక్కడ నిర్మాణం జరగాలో ఈశ్వరుడు ముందే నిర్ణయించాడు. ఎందుకు ఈ ఊహలు?" అన్నారు. మనస్సు చేయగలిగింది కేవలం సేకరణ, పోగుజేసుకోవటం. తిరస్కరించటం, నిర్ధారణ చేయటం జ్ఞాపకం పెట్టుకోవటం దాన్ని వెంటాడటం. నిస్సందేహంగా శాంతి కావలసినదే. శాంతం లేకుండా నవీనంగా ఉండలేము, జీవించలేము. మనస్సు పోరాటాలద్వారా, తిరస్కారాలద్వారా, సాధించగలిగింది శాంతా! మనస్సు ఒక నమ్మికకు, కాంక్షలను వెదుక్కుంటుంది. అందులో జీవిస్తుంది. మన మనస్సు గతకాలం, వర్తమానకాలం, భవిష్యత్‌కాలానికి సంబంధించిన ఆలోచనలు చేస్తుంది. మనస్సు బడాయిలను, దాని అలవాట్లను ఆలోచిస్తుంది. తన నమ్మకాలను తానే నిరంతరం ఖండిస్తూ, దోషాలను నిర్ణయిస్తూ, ఒక దానితో ఒకటి పోల్చి చూస్తూ దాన్ని పొందాలని ఆరాటపడుతుంది. అటువంటి మనస్సుకి ఎన్నటికీ శాంతి లభించదు. శ్రీనాన్నగారు "తలంపు లేకుండా కామంలేదు, కోపం లేదు, దేహం లేదు, జగత్తు లేదు, దేవుడు లేడు. ఈ ఆలోచనలు కలుగుతున్న నేను ఎవడను? అని విచారణ చేస్తే ఆ నేను అంతర్ముఖం అవుతుంది" అన్నారు. మనస్సు ఒక గుంపులాంటిది. నిరంతరం ఏదో ఒకటి చింతించటం వల్లనే అక్కడ ఉంటుంది. ఒక్కొక్క ఆలోచనా వదిలేస్తే చివరకు ఏమీ లేదు. మనస్సు లేని "స్థితి" వుంటుంది. కాని ఆలోచనలు ఒక దాని వెంట ఒకటి పరుగెత్తుకొంటూ వుంటాయి. రెండు ఆలోచనల మధ్య ఎడం ఏమీ ఉండదు. విరామం ఉంటే అదే అసలైన మనం (ఆత్మగా) ఉంటాము. మనస్సు కాలంతో ఉంటుంది కాలాతీత తత్వం గురించి మనం ఎంత మాట్లాడినా అది కాలంలోనే వుంటుంది. కాబట్టి ఊహల్లో జీవించటం మానాలి. వాస్తవంలో జీవించటం నేర్చుకోవాలి. ఈ క్షణం చైతన్యవంతంగా, అప్రమత్తంగా, పూర్తి ఎరుకతో జీవించటం నేర్చుకోవాలి. అప్పుడు ఉండేది ఆనందం ముందు రాబోయే ముక్తి మాట ఎందుకు ఇది దేశ కాలాల సారాంశం అంటారు అనుభవజ్ఞులు. ఈ సృష్టిలో ఏ జంతువుకూ భాష తెలియదు. వాక్కు వల్లనే మానవుడయ్యాడు. దాన్ని ఉపయోగించుకొని సత్యాన్ని పొందాలనే విషయం నిరంతరం గుర్తించుకొని జీవితం సఫలం చేసుకోవాలి.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966**